క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

సత్తెనపల్లి: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 10న సాయంత్రం 4:00 గంటలకు సత్తెనపల్లిలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి బుధవారం తెలిపారు. 'బాబు షూరిటీ మోసం గ్యారంటీ' చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ 'రీ కాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, పట్టణ, మండల, గ్రామ, వార్డు పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రేపు విద్యుత్ అదాలత్

సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో గల శ్రీ మాడా విశ్వేశ్వరరావు కల్యాణ మండపంలో ఈ నెల 11న ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు కన్‌జ్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) విజయవాడ వారి ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు జరుగుతుందని నరసరావుపేట ఈఈ సీహెచ్ రాంబొట్లు బుధవారం తెలిపారు. ఈ అదాలత్‌కు సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎస్.విక్టర్ ఇమాన్యూల్, పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ అధికారులు పాల్గొంటారన్నారు. డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాత పూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నెంబర్, పూర్తి అడ్రస్, సెల్ నెంబర్‌తో అర్జీ ఇచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీలకు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని వినతి



క్రోసూరు: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు ఫేస్ యాప్(ఎఫ్ఆర్ఎస్) రద్దు చేయాలని, సెంటర్ నిర్వహణకు ఒక్క యాప్ మాత్రమే పెట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోసియేషన్ క్రోసూరు ప్రతినిధి తహసీల్దార్ వీవీ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు బేబీరాణి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు సర్వర్లు పనిచేయటం లేదని, దానివల్ల సరుకులు సమయానికి సెంటర్‌కు రావటం లేదని, దీంతో సరుకులు లబ్ధిదారులకు అందించలేకున్నామని ఆరోపించారు. అన్ని సరుకులు చేరిన తరువాత ఫొటో క్యాప్చర్ చేయాల్సి ఉంటుందని, సర్వర్ సమస్యతో కుదరటం లేదన్నారు. కావున అంగన్‌వాడీలకు ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని, ఒకే యాప్ పెట్టాలని కోరారు. క్రోసూరు ప్రాజెక్ట్ కార్యదర్శి జయ, అధ్యక్షురాలు శివపార్వతి, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో మహిళా సర్పంచుల పాత్ర కీలకం



సత్తెనపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు అందించే నిధుల వినియోగం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో మహిళా సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఎంపీడీవో బండి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహిళా సర్పంచులకు సాధికారత, అభివృద్ధి ప్రణాళికలపై పూర్తి స్థాయి అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 7 నుంచి అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ, అచ్చంపేట మండలాల నుంచి 34 మంది మహిళా సర్పంచ్‌లకు ఇస్తున్న శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంపీడీవో బండి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహిళా నాయకత్వం, స్థానిక పాలనలో మార్పులు, పనుల విభజన, పంచాయతీరాజ్ చట్టాలు, సర్పంచుల విధులు, ఆర్థిక వనరులు, గ్రామసభల నిర్వహణ వంటి 12 అంశాలపై శిక్షణ కల్పించడం జరిగిందన్నారు. రుద్రవరం, మాచవరం పంచాయతీ కార్యదర్శు లు శిక్షణ ఇచ్చారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ట్రైనింగ్ డిప్యూటీ ఎంపీడీవో పూర్ణచంద్రరావు, రూపవతి, మహిళా సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేయాలి



అచ్చంపేట: పాఠశాలలో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, మెనూ ప్రకాం విద్యార్థులకు భోజనం పెట్టాలని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ సభ్యురాలు జి.దేవి అన్నారు. బుధవారం ఆమె అచ్చంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కస్తూరిబా బాలిక పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. వంట ఏజెన్సీలకు పలు సూచనలిచ్చారు. అనంతరం విద్యార్థుల డార్మిటరీ, వసతి గృహాలను పరిశీలించారు. ఆమె వెంట జీసీడీవో రేవతి, ఎంఈవో ఏకుల ప్రసాదరావు, కేజీబీవీ ఎస్‌వో జ్యోత్స్న దీప్తి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్, ఎంపీపీ పాఠశాల హెచ్ఎం జ్యోతి, అంగన్వాడీ సూపర్‌వైజర్స్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కట్టబెడుతున్న ప్రకృతి వనరులు



సత్తెనపల్లిలో మాట్లాడుతున్న గుంటూరు విజయకుమార్



రెంటపాళ్ళలో ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న నాయకులు



సత్తెనపల్లి అమరావతి బస్‌పాయింట్ సెంటర్‌లో నిరసనలో ఏఐటీయూసీ నాయకులు



రాజుపాలెం డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు



అచ్చంపేటలో మాట్లాడుతున్న సీఐటీయ గౌరవాధ్యక్షులు హనుమంతరావు

- కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మికుల నిరసన
- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు గుంటూరు విజయకుమార్



సత్తెనపల్లిలో ప్రదర్శన చేస్తున్న సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులు

సత్తెనపల్లి: దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను, ప్రకృతి వనరులను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూనుకుందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు గుంటూరు విజయకుమార్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె బుధవారం సత్తెనపల్లిలో విజయవంతంగా జరిగింది. పట్టణంలోని మున్సిపల్ కార్మికులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్స్, మార్కెట్‌యార్డ్ ముఠా వర్కర్స్, ఎల్ఐసీ, బ్యాంకింగ్ తదితర రంగాల ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు తమ విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ముందుగా స్థానిక మార్కెట్‌యార్డు నుంచి బయలుదేరిన కార్మిక ప్రదర్శన ఆర్ అండ్ బీ బంగ్లా, తాలూకా సెంటర్, గడియాస్తంభం మీదుగా తిరిగి తాలూకా సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక తాలూకా సెంటర్‌లో శాస్త్రి విగ్రహం వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హరిపోతురాజు అధ్యక్షత వహించారు. గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలు రద్దుచేసి కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు అనుకూలమైన 4 లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. ఈ సమ్మె ద్వారా యావత్ కార్మిక వర్గం ఈ లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందేనని ముందుకు వచ్చాయన్నారు. పలు యూనియన్ల నాయకులు అంగన్‌వాడీ వర్కర్స్–సుజాత, మున్సిపల్ వర్కర్స్– వి.చంద్రకళ, ఐద్వా– డి.విమల, మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్– షేక్ జానీ, రైతు సంఘం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అనుముల వీరబ్రహ్మంలు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.శివ దుర్గారావు, కె.ఆంజనేయులు, జె.రాజ్ కుమార్, జి.రజిని, ఎం.జ్యోతి, ఎల్ఐసీ యూనియన్ నాయకులు వంశీ, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో...

కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కాలరాసి కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త కార్మిక, ఉద్యోగ సంఘాల సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో అమరావతి బస్‌పాయింట్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సత్తెనపల్లి నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు, న్యాయవాది నరిశేటి వేణుగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు డీఆర్ మస్తాన్, ఈసీ రెడ్డి అంజిరెడ్డి, ఆర్.కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, షేక్ మాబుసుభాని, పెదకూరపాడు బాబు, చెన్నారావు, దారా మరియదాసు, కిరణ్, బాబు, దానయ్య, రాజు, నగేష్, నాగేశ్వరరావు, సూరిబాబు, వెంకట్రావు, శ్రీనివాస్, చారి పాల్గొన్నారు.

పలు సంఘాల ఆధ్వర్యంలో...

బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, కార్మికుల వెన్నుముక విరిచే చట్టాలు చేస్తుందని కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ప్రజా సంఘాలు, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం రెంటపాళ్ళ గ్రామంలో ప్రధాన రహదారిపై బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెండ్యాల మహేష్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు ఈ పోరాటాలు కొనసాగుతాయని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు మొక్కపాటి నరసింహారావు, రావూరి పూర్ణచంద్రరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి భగత్, మహిళా సంఘం దుగ్గి మేరమ్మ, జిల్లా కమిటీ సభ్యురాలు అనూష, విద్యార్థి సంఘం అమూల్య, యువజన సంఘం పెద్దబ్బాయి, అనిల్, రైతు సంఘం నాయకులు బగ్గీ వెంకట నారాయణ, సత్యవతి, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో...

రాజుపాలెం: దేశ వ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు స్థానిక తహసీల్దారు కార్యాలయం ముందు బుధవారం నిరసన తెలియజేశారు. ఈ నిరసనలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దారు జానీబాషాకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో రాష్ట్ర కమిటీ సభ్యుడు పి.సంజీవరావు, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే నిలిపివేయాలని సీఐటీయూ మండల గౌరవాధ్యక్షులు టి.హనుమంతరావు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా వామపక్షాల ఆధ్వర్యంలో బుధవారం అచ్చంపేట ప్రధాన వీధులలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తూ రాస్తారోకో చేశారు. అనంతరం ఆంజనేయస్వామి విగ్రహం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ ఎన్నికల ముందు కనీసం వేతనం రూ.26 వేలు చేస్తామన్న టీడీపీ ఆ ఊసెత్తడం లేదన్నారు. లేబర్ కోడ్‌లను తక్షణమే విరమించుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్ వెంకటేశ్వర్లు, కేకే రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసరావు, షేక్ బుజ్జి, సంపంగి ఏడుకొండలు, వివిధ గ్రామాల ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

విజయవంతమైన సార్వత్రిక సమ్మె

నకరికల్లు: ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటీకరణ నిర్ణయం తక్షణమే నిలిపివేయాలని సీపీఎం సీనియర్ నాయకులు ఈవూరి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా నకరికల్లులో సీపీఎం, రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘం, ఆటోవర్కర్స్ యూనియన్, డీవైఎఫ్ఐ, భవన నిర్మాణ కార్మికుల సంఘం, ఆశావర్కర్‌లు, సమాచారహక్కు చట్టం ఐక్యవేదిక, సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సార్వత్రిక సమ్మె చేపట్టారు. బ్యాంకులు, పోస్టాఫీసు, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు మూయించారు. స్థానిక బ్యాంకు బజారు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలన్నారు. తహసీల్దార్ కె.పుల్లారావుకు డిమాండ్‌లను వివరించారు. కార్యక్రమంలో జి.పిచ్చారావు, గాదె కుమారి, గోదా బాల, భూలక్ష్మి, ఈవూరి అప్పిరెడ్డి, ముజావర్ జాన్ అహ్మద్, చట్టు కోటేశ్వరరావు, రామాంజినాయక్, సత్యనారాయణరాజు, గంటా అగస్టీన్, గోదా చిన్ని, రాజు తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళలో...

ముప్పాళ్ళ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాల్సిన అవసరం రైతాంగం, కార్మికులుగా మనందరిపైన ఉందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం మండల కేంద్రమైన ముప్పాళ్ళలో తహసీల్దార్ కార్యాలయం నుంచి ముప్పాళ్ళ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ రానున్న కాలంలో పోరాటాలు నిర్వహించి హక్కులు కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మార్పుల వెంకటరెడ్డి, గారా జాలయ్య, కందిమళ్ళ సాంబశివరావు, రావిపాటి వెంకటేశ్వర్లు, ఇందూరి వెంకటరెడ్డి, తొరటి అమరలింగేశ్వరరావు, కంచర్ల నాగేశ్వరరావు, తోట బ్రహ్మయ్య, పఠాన్ సైదాఖాన్, తొండపి మస్తాన్, దాసరి వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వీరమ్మ, రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్‌లు, రైతులు పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన క్రోసూరులో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ కార్యదర్శి ఏఐటీయూసీ నాయకులు పోతుగంటి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్‌లకు దోచిపెట్టే విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున ఆందోళన చేపటినట్లు చెప్పారు. కార్యక్రమంలో హమాలీలు నాయకులు ఏడుకొండలు నాగేశ్వరరావు, రవి, సీపీఐ నాయకులు యాదగిరి, కాళిదాసు, నాగరాజు, అంకారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు సీఐటీయూ ఆధ్వర్యంలో: సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో క్రోసూరులో ప్రభుత్వ సంస్థల్లోని అన్ని కార్మిక సంఘాలు, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్త్, పంచాయతీ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మానవహారం చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయు నాయకులు జి.రవిబాబు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను కార్మికులు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



నకరికల్లు స్టేట్‌బ్యాంకును మూయిస్తూ నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు



ముప్పాళ్ళలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు



క్రోసూరులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మెలో మానవహారం

కార్మికులపై కేంద్ర ప్రభుత్వం వివక్ష

- అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి జ్యోతిశ్రీ
- పెదకూరపాడులో సార్వత్రిక సమ్మె విజయవంతం



పెదకూరపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాలు

పెదకూరపాడు: కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి, పల్నాడు జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుడు కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ అన్నారు. నియోజవర్గ కేంద్రమైన పెదకూరపాడులో సార్వత్రిక సమ్మె నేపథ్యంలో బస్టాండ్ సెంటర్‌లో బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం కార్మికులపై చూపిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. శరత్‌చంద్ర మాట్లాడుతూ కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రైవేటీకరణకు బానిసలుగా మారిన పాలకులను ప్రజలు హెచ్చరించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. పల్నాడు జిల్లా సీఐటీయూ మహిళా కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి మాట్లాడుతూ ఈ సమ్మె ఒక్కరోజు కార్యక్రమం కాదు, ప్రజా ఉద్యమాల ప్రారంభానికి నిదర్శనం మాత్రమే అన్నారు. సీపీఐ కార్యదర్శి పట్టణ కార్యదర్శి పఠాన్ నాగుల మీరా, నేలపాటి ఏసోబు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కార్మికుల పక్షాన పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఆటో వర్కర్స్, పంచాయతీ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోంది



అమరావతి మెయిన్‌రోడ్‌లో సార్వత్రిక సమ్మెలో కార్మికులు

అమరావతి: దేశ వ్యాప్తంగా కార్మిక వర్గాల పిలుపు మేరకు చేపట్టిన సార్వత్రిక సమ్మెలో బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీ బొమ్మ వరకు కార్మిక వర్గం నిరసన ప్రదర్శన నిర్వహించి అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పల్నాడు ఏఐటీయూసీ నాయకుడు భైరాపట్నం రామకష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కూటమి ప్రభుత్వం కారుచౌకగా పెట్టుబడుదారులకు అప్పచెబుతుందన్నారు. కార్మికులు సాధించుకున్న హక్కుల్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సార్వత్రిక సమ్మెలో అంగనవాడీ వర్కర్లు, ఆయాలు ఆశ కార్యకర్తలు, గ్రామ రెవెన్యూ సహాయకులు, పంచాయతీ కార్మికులు మధ్యాహ్నం భోజనం కార్మికులు పాల్గొన్నారు. కార్మిక సంఘ నాయకులు మొహిద్దీన్ వలి, శరణం విజయ్, మునగోటి శ్రీనివాసరావు, చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



అమరావతి సీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం




పెదకూరపాడు సీహెచ్‌సీలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

అమరావతి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం అవసరమని దీని వల్ల పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, వైద్యుల సూచనల మేరకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షుడు మేకల హనుమంతరావు అన్నారు. కాకతీయ విద్యా సంస్థ, జన చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి నెల 9వ తేదీన వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు బుధవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మేకల హనుమంతరావు మాట్లాడుతూ స్త్రీ గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యే వరకు వైద్యుల సూచనల మేరకు మందులతో పాటు బలవర్ధకమైన తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ గోనుల సరస్వతి, జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు, బీజేపీ సీనియర్ నాయకులు మద్ది దాత్రి నారాయణ, నేరెళ్ల హనుమంతరావు, ఆసుపత్రి సిబ్బంది, జన చైతన్య సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత

పెదకూరపాడు : గర్భిణులు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పెదకూరపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం, 75 తాళ్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు. బ్రహ్మయ్య మాట్లాడుతూ మాంగులూరి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ నాయకురాలు షేక్ ముంతాజ్, మాజీ ఎంపీపీ గల్లా బాబురావు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రసాద్, అజీముల్లా, కుమారి, కొండవీటి ప్రసాద్, మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణానది ఒడ్డున గుర్తు తెలియని మృతదేహం



అచ్చంపేట: మండలంలోని మాదిపాడు కృష్ణానది ఒడ్డున గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు బుధవారం గుర్తించి అచ్చంపేట పోలీస్ స్టేషన్‌కు సమాచం అందించారు. సీఐ శ్రీనివాసరావు మృతదేహాన్ని పరిశీలించి మగవంగా గుర్తించారు. మృతి చెంది సుమారు రెండు, మూడు రోజులై ఉండవచ్చని, వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉండి ఉండవచ్చని అంచనా వేశారు. తెలుపు రంగా చొక్కా, ఎరుపు రంగు అంచుకలిగిన పంచ ధరించి ఉన్నాడని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలలో ఈ మధ్య ఎవరైనా ఇంటికి వెళ్లని వారు ఉన్నా వెంటనే అచ్చంపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించవలసినదిగా సీఐ శ్రీనివాసరావు కోరారు.

'అన్నదాత సుఖీభవ'కు పేర్లు నమోదు చేసుకోవాలి



సత్తెనపల్లి: అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇంకా ఎవరైనా రైతులు కొత్త పొలం పాస్‌బుక్ పొంది, ఇతర కారణాల వలన అర్హుల జాబితాలో పేరు లేకపోతే రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి అర్హత ఉన్న రైతులు అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయించుకోవాలని సత్తెనపల్లి మండల వ్యవసాయాధికారి బి.సుబ్బారెడ్డి తెలిపారు. మండలంలోని ఫణిదం, దీపాలదిన్నెపాలెం గ్రామాలలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కౌలు రైతులందరూ మీ గ్రామంలోని రైతు సేవా కేంద్రం ద్వారా భూ యజమానులు అంగీకారంతో పంట సాగు హక్కు పత్రాలు పొందాలన్నారు. రైతులు అధీకృత డీలర్లు వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని, మీ గ్రామాలలో ఎవరైనా బీజీ 3 లేదా గ్లైసెల్ బీటీ పత్తి విత్తనాలు అమ్మకాలు జరుపుతున్నట్లయితే కొనుగోలు చేయవద్దని, అటువంటి అమ్మకాలపై వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. మిరప సాగు చేసే రైతులు షేడ్ నెట్‌లలో నారు పెంచుకోవాలన్నారు. ఇలా పెంచుకోవటం వలన తెగుళ్ల, పురుగుల తాకిడి తగ్గించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ జానీ బాషా, వీఏఏలు, ఫణిదం, దీపాలదిన్నెపాలెం గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

లగడపాడులో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

అన్నదాన కార్యక్రమం చేపట్టిన కార్యకర్తలు





పెదకూరపాడు : మండలంలోని లగడపాడు, 75 తాళ్లూరు గ్రామాల్లో మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. క్రోసూరు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ ఏదో సామిరెడ్డి ఆధ్వర్యంలో 75 తాళ్లూరులో వేడుకలు ఘనంగా నిర్వహించారు. లగడపాడు గ్రామంలో బత్తుల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల హృదయంలో వైఎస్సార్ శాశ్వతంగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల కోటేశ్వరరావు, ఎంపీటీసీ షేక్ బుడ్డా, బత్తుల రాజేందర్, హసన్, కోడెల రామారావు, రామచంద్ర రమేష్, జ్ఞానేష్, యోహాను పాల్గొన్నారు.

మహానేత రాజశేఖరరెడ్డిని మరువలేము

పీసపాడు(క్రోసూరు): మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డిని మరచిపోలేమని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు విప్పల వెంకట్రామిరెడ్డి అన్నారు. మండలంలోని పీసపాడు గ్రామంలో మంగళవారం రాత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీసపాడులోని లైబ్రరీ సెంటర్, సచివాలయం సెంటర్, పీసపాడు ఎస్సీ కాలనీ, అనుబంధ గ్రామం పారుపల్లిలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, అల్పాహారాలు పంపిణీ చేసి వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మాట్లాడారు. కార్యక్రమంలో పొట్లపల్లి కాశిరెడ్డి, విప్పల రాజశేఖరరెడ్డి, నంద్యాల ఆదిరెడ్డి, అల్లు సంజీవరెడ్డి, సర్పంచ్ గొర్రెపాటి రాజు, జి.ప్రశాంత్‌బాబు, అల్లుకేశవరెడ్డి, వీర్లపాటి శివ, షేక్ లడ్డూబాబు, జి.రాంబాబు, జి.మహేష్, ఏసుబాబు, ఉప సర్పంచ్ జి.బాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల పురోగతి సూచికపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి

సత్తెనపల్లి: గ్రామ పంచాయతీల్లో ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా అవార్డు సాధించటానికి గ్రామ పంచాయతీల పురోగతి సూచికపై తప్పనిసరిగా అవగాహన ఉండాలని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2023–24 సంవత్సరానికి గాను పంచాయతీల పురోగతి సూచికపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. శిక్షణలో డిప్యూటీ ఎంపీడీవో ఏ శ్రీనివాసరెడ్డి, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.